'పెద్ది'కి నాయకుల పరామర్శ

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో నాయకులు

చెన్నారావుపేట, నవంబర్ 11: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని చెన్నారావుపేట బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకొని స్వగ్రామం నల్లబెల్లిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసిన నాయకులు జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు రఫీ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సాంబయ్య, కుసుమ నరేందర్, మండల యూత్ అధ్యక్షులు రమేశ్, నర్మెట్ట సాంబయ్య, సాదు నర్సింగారావు, యాకయ్య, బోడ రవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌లో నర్సంపేట విద్యార్థికి కాంస్యం

ముబిన్‌ను అభినందిస్తున్న ఎంఈవో సారయ్య

నర్సంపేట, నవంబర్ 11: ఈనెల 8 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో నర్సంపేట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మహ్మద్ ముబిన్ 55కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం, ఎంఈవో కొర్ర సారయ్య తెలిపారు. విద్యార్థిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎల్.రమేశ్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, రమేశ్, రవికుమార్, గోపాల్, కోట రాంబాబు పాల్గొన్నారు.

యూత్ సభ్యులకు క్రీడా పరికరాల అందజేత

క్రీడా పరికరాలను అందజేస్తున్న కార్తీక్‌గౌడ్

నర్సంపేట రూరల్, నవంబర్ 11: మండలంలోని ముగ్ధంపురంలో యూత్ సభ్యులకు అభ్యుదయ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్ చేతుల మీదుగా క్రీడా పరికరాలను అందజేశారు. అభ్యుదయ యూత్ కమిటీ సభ్యులకు వాలీబాల్, క్రికెట్‌బ్యాట్, బాల్, షటిల్, బ్యాట్స్, కాక్స్‌లను ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్ ఆర్థిక చేయూతతో కొనుగోలు చేసి అందజేశాడు. ఆయన మాట్లాడుతూ అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట మండల స్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నమెంట్స్ త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్స్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిటీ సభ్యులు బైరగోని చరణ్, యశ్వంత్, చందు, విక్రం, నవీన్, రిషి ఉన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంగెం, నవంబర్ 11: మండలంలోని ముంద్రాయి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి హెచ్ఎంలు సత్యనారాయణ, రాఘవేందర్, ఉపాధ్యాయులు సూర్యకళ, కృష్ణమూర్తి, రాజు, కుమారస్వామి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి సాయం చేయండి

మంత్రి సురేఖకు వినతి

కాశీబుగ్గ : మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న దాసరి రాజేశ్

కాశీబుగ్గ, నవంబర్ 11: నగరంలోని 19వ డివిజన్ శ్రీసీతారామాంజనేయ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాస ప్రారంభం నుంచి అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరారు. ఆలయ అధ్యక్షుడు వెలిశాల ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్ పాల్గొన్నారు. కాగా, మంత్రికి ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలు పలు సమస్యలను దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రిని లక్ష్మీపురం మోడల్ కూరగాయల వర్తక వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జారతి రమేశ్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు జారతి శ్రీనివాస్, బూర్గుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, వరంగల్‌లోని లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌ను మంగళవారం మంత్రి సురేఖ సందర్శించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు.

కాటమయ్యకు మంత్రి పూజలు

గీసుగొండ: మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వంచనగిరిలో సోమవారం గౌడ కులస్తులు నిర్వహిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మంత్రి కంఠమహేశ్వరస్వామి, రేణుక ఎల్లమ్మ, వన మైసమ్మలకు పూజలు చేశారు. గ్రామంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించుకున్న కంఠమహేశ్వరుడి ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి మంత్రి సురేఖ, మురళీధర్‌రావు దంపతులు రూ.5లక్షల ఆర్థికసాయం అందించారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సురేందర్‌కు ఎమ్మెల్యే సన్మానం

సురేందర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట రూరల్, నవంబర్ 11: ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించిన మండలంలోని ఆకులతండాకు చెందిన ధారావత్ సురేందర్‌ను సోమవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సన్మానించారు. సురేందర్ మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, డిగ్రీ కళాశాల లెక్చరర్, గురుకుల పాఠశాల టీచర్, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్, ఢిల్లీ సబార్డినేట్ టీచర్‌తోపాటు గ్రూప్-4లో అర్హత సాధించాడు. పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాడు. కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను సత్కరించారు. బానోత్ లక్ష్మణ్‌నాయక్, బానోత్ రాము పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చెన్నారావుపేట, నవంబర్ 11: రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని అమీనాబాద్ పీఏసీఎస్ చైర్మన్ మురహరి రవి అన్నారు. సోమవారం పీఏసీఎస్ పరిధిలోని అమీనాబాద్, తిమ్మరాయిన్‌పహాడ్, పాపయ్యపేట, గొల్లభామతండాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ పత్తినాయక్, జిల్లా నాయకులు మొగిలి వెంకట్‌రెడ్డి, మండల నాయకులు మంద యాకయ్య, సిద్దన రమేశ్, బండి హరీశ్, వీరారెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మత తత్వ పాలనపై పోరాడాలి

నర్సంపేట, నవంబర్ 11: కేంద్రంలోని బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందని సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యుడు పంజాల రమేశ్ అన్నారు. సోమవారం వడ్లకొండ స్వామి అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు సహజ వనరులను దోచి పెడుతూ సామాన్యుల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. నాయకులు బాస్మియా, ప్రసాద్, అక్కపెల్లి రమేశ్, గడ్డం యాకయ్య, మునీశ్వర్, కవిత, సతీశ్ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం స్వాధీనం

గీసుగొండలో పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

నర్సంపేట రూరల్/ గీసుగొండ/నెక్కొండ, నవంబర్ 11: అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు మండలంలోని రెండు గ్రామాల్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ముగ్ధంపురానికి చెందిన కొమ్మ చంద్రమౌళి ఇంట్లో 25క్వింటాళ్లు, గురిజాలకు చెందిన గొడిశాల శ్రీనివాస్ ఇంట్లో 4క్వింటాళ్లు, గోలి రవీందర్ ఇంట్లో 4క్వింటాళ్ల బియ్యం, 3.5క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 33క్వింటాళ్ల పీడీఎస్ రైస్, 3.5క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దాడుల్లో ఎస్సై రాజు, ఆర్ఎస్ఐ భానుప్రకాశ్, టాస్క్ ఫోర్స్ టీమ్ పాల్గొన్నారు. గీసుగొండ మండలం విశ్వనాథపురం శివారులోని మారుతీ మిల్‌టెక్ రైస్ ఇండస్ట్రియల్‌లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, గీసుగొండ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. మిల్లు యజమాని జూలూరి వేణు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి మిల్లులో నిల్వచేసినట్లు సమాచారం మేరకు దాడి చేసి 24.5 క్వింటాళ్లు పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే, నెక్కొండలోని రాజీవ్ నగర్ కాలనీలో ఎండీ పాష అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేశాడనే సమాచారం మేరకు దాడి చేసి, 110.5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు నెక్కొండ ఎస్సై తెలిపారు. పాషపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

మాట్లాడుతున్న బీసీ నాయకులు

నర్సంపేట, నవంబర్ 11: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు సోల్తి సారయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, గ్రాడ్యూయేషన్ విద్య అభ్యసించి, ఉన్నత చదువుల కోసం సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెళ్తే పూర్తి ఫీజు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులకు విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి ఫీజులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని కోరారు. నీలారపు నరేందర్, సోల్తి రవి, సాంబరాతి మల్లేశం, వెంకన్న, మద్దెల సాంబయ్య పాల్గొన్నారు.

పదో తరగతి ఫీజు చెల్లించాలి

గిర్మాజీపేట, నవంబర్ 11: పదోతరగతి రెగ్యులర్ విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజును ఈనెల 18లోగా చెల్లించాలని డీఈవో జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుంతో డిసెంబర్ 21 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, నవంబర్ 11: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ ఫ్రెష్, రెన్యూవల్ కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు విద్యార్థులు తమ వివరాలను డిసెంబర్ 12లోగా http://telanganaepass. cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు.

ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య

ఖిలావరంగల్, నవంబర్ 11: ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం అనంతారం గ్రామానికి చెందిన తైటు రవి(46) కుటుంబ కలహాల కారణంగా శంభునిపేటలో అద్దెకు ఉంటూ ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విక్రయించేవాడు. కాగా, ఇంటి అద్దె కోసం యజమాని తలుపులు తెరవగా ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులకు, డయల్ 100 ఫోన్ చేసి సమాచారం చేరవేశాడు. పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి ఉరేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రాయపర్తి మండలం జింకురాంతండాకు చెందిన బాధావత్ సురేష్ (26) ఆదివారం రాత్రి బైక్‌పై హనుమకొండకు వెళ్తుండగా మామునూరు చెరువుకట్ట సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు మమునూరు పోలీసులు తెలిపారు. తలకు తీవ్రంగా గాయాలై అక్కడిక్కడే మృతిచెందగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎస్ఆర్ నగర్‌లో గుట్కాలు పట్టివేత

కాశీబుగ్గ, నవంబర్ 11: ప్రభుత్వ నిషేధిత గుట్కాలు, అంబర్లు, ఇతర పొగాకు వస్తువులను అమ్ముతున్నట్లు పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్సు అధికారులు ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.30,340 విలువైన పోగాకు వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన గోపగాని చంద్‌ను అదుపులోకి తీసుకొని ఎనుమాముల పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్సు ఏసీపీ మధుసూదన్, సీఐ కె.శ్రీధర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాశీబుగ్గ, నవంబర్ 11: టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ములుగు రోడ్డు సమీపంలో ఉన్న వంగ విజయ్‌కుమార్ నివాసంలో పేకాటరాయళ్లు ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేశారు. రూ.52వేలు నగదు, సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. అనుకుంట్ల నరసింహా, పిట్టల ప్రభాకర్, ఆరెపల్లి పీటర్, కడప అజయ్‌కుమార్, వేల్పుల సురేందర్, పొగరు లక్ష్మన్, సంఘు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరు..

చెన్నారావుపేట, నవంబర్ 11: నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఈర్యతండా నుంచి చెన్నారావుపేట, ముగ్ధంపురం నుంచి పాత ముగ్ధంపురానికి నాటుసారా రవాణా చేస్తున్న ధరంసోత్ వెంకన్న, ఇస్లావత్ భరత్ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై శార్వాణి, రాజన్న, సిబ్బంది లింగేశ్వర్, వాజిద్, లింగస్వామి, స్వర్ణలత, నాగరాజు, హైమద్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సంగెం, నవంబర్ 11: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. యూనియన్ బ్యాంకు 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం సంగెం శాఖలో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ అనిల్‌తో ఆయన కేక్ కట్‌చేశారు. ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతూ రోజు రోజుకు బ్యాంకు సేవలు విస్తరిస్తున్నాయనారు. మాజీ ఎంపీపీ కళావతి, ఖాతాదారులు పులి వీరస్వామిగౌడ్, ఏపీఎం డి.కిషన్, గజ్జెల శ్రీనివాస్, బ్రహ్మయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

విదర్భలో విజేతదే మహా పీఠం

- ఇక్కడ 62 అసెంబ్లీ నియోజకవర్గాలు
- ఈ ప్రాంతంలో పట్టు సాధిస్తే అధికారం పక్కా
- ప్రత్యేక దృష్టి సారించిన రెండు కూటములు

ముంబై, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు కూటములు విదర్భ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. 62 నియోజకవర్గాలు ఉన్న విదర్భలో పాగా వేస్తే అధికారానికి దగ్గరైనట్టే అని కూటములు లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలను ఆకర్షించి మెజార్టీ సీట్లు తమ ఖాతాలో వేసుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పటికే రెండు కూటముల నుంచి అగ్రనేతలు విదర్భ మొత్తాన్ని చుడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా పత్తి పండించే రైతులు ఉన్న ఈ ప్రాంతంలో రైతులు ఎటువైపు నిలుస్తారనేది గెలుపోటములను నిర్ణయించనుంది.

రెండు కూటములకూ కీలకం

విదర్భలోని మొత్తం 62 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ 36 స్థానాల్లో ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. 11 జిల్లాలు కలిగిన విదర్భ ప్రాంతం 1990ల వరకు కాంగ్రెస్‌కు కంచుకోట. మూడు దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీ - శివసేన కూటమి పట్టు పెంచుకుంది. 2014లో ఇక్కడ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 44 స్థానాలను గెలుచుకుంది. 2019లో 29 స్థానాలకు పడిపోయింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) ఇక్కడ మంచి ఫలితాలను సాధించింది. విదర్భలోని 10 లోక్‌సభ స్థానాల్లో ఏడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విదర్భలో పాగా వేసేందుకు ఎంవీఏ ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయం విదర్భలోనే నెలకొని ఉండటం, రాష్ట్ర బీజేపీకి జోడుగుర్రాల్లాంటి దేవేంద్ర ఫడ్నవీస్, చంద్రశేఖర్ బవాంకులే ఈ ప్రాంతానికి చెందిన వారే కావడంతో బీజేపీ ఈసారి విదర్భ ప్రాంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది.

మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

- పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుండొచ్చు
- శాస్త్రవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుండొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పని చేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా రాకెట్ల వర్షం

90కి పైగా క్షిపణుల ప్రయోగం • పలువురికి గాయాలు • ధ్వంసమైన వాహనాలు

హెజ్బొల్లా రాకెట్ దాడులతో ఇజ్రాయెల్‌లోని హైఫాలో దహనమవుతున్న కార్లు

బీరుట్, నవంబర్ 11: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య పోరు మరింత తీవ్రరూపం దాల్చింది. లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్ సోమవారం ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్ నగరం 'హైఫా' లక్ష్యంగా 90కిపైగా క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో హైఫాలో పలు భవనాలు దెబ్బతిన్నాయని, పలువురు గాయపడ్డారని, వాహనాలు ధ్వంసమయ్యాయని మీడియా కథనాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన పలు మిస్సైల్స్‌ను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 'ఐరన్ డోమ్' అడ్డుకున్నప్పటికీ, మరికొన్ని హైఫాలో పలు జనావాస ప్రాంతాల్ని తాకాయని తెలిసింది. ఒక చిన్నారి సహా నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారని ప్రాథమిక సమాచారం. హెజ్బొల్లా రాకెట్ దాడుల్ని ఇజ్రాయెల్ భద్రతా బలగాలు (ఐడీఎఫ్) ధ్రువీకరించాయి. హైఫా పట్టణం శివారు ప్రాంతాల్ని మిస్సైల్స్ తాకాయని ఐడీఎఫ్ పేర్కొన్నది.

శ్మశానం కింద హెజ్బొల్లా సొరంగం!

హెజ్బొల్లా సభ్యులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ఆదివారం తెలిపింది. వీటిలో ఒకటి శ్మశానం కింద ఉందని ఆరోపించింది. కిలోమీటర్ పొడవున ఉండే ఈ సొరంగాలను గుర్తించామని ఎక్స్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఈ సొరంగాల్లో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్స్, నిద్రించే గదులు, ఆయుధగారాలు ఉన్నట్టు ఐడీఎఫ్ వెల్లడించింది. ఓ సొరంగంలో డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి ఉన్న వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఉగ్రవాదుల అండర్ గ్రౌండ్ సొరంగాలను మా దళాలు ధ్వంసం చేశాయి. అందులో వ్యూహాత్మకంగా శ్మశానం కింద కూడా ఒకటి ఉంది. హెజ్బొల్లా మనుషులు చనిపోయినా, బతికున్నా వారికి విలువ ఇవ్వదు' అని ఐడీఎఫ్ విమర్శించింది.

ఇరాన్ రసాయన ఆయుధాల అభివృద్ధి!

ఇజ్రాయెల్ సైనికులు, పౌరులపై ప్రయోగించేందుకు ఇరాన్ రసాయన ఆయుధాల్ని సిద్ధం చేసిందన్న వార్తలు వెలువడ్డాయి. ఔషధ తయారీలో రసాయన ఏజెంట్స్‌గా వాడే సింథటిక్ ఓపియాయిడ్లు, ఫెంటానేల్.. వంటి వాటితో ఇరాన్ రసాయన ఆయుధాల్ని అభివృద్ధి చేసిందని అమెరికా రక్షణ రంగ నిపుణుడు మాథ్యూ లెవిట్ వెల్లడించారు. శక్తివంతమైన రసాయన ఏజెంట్స్‌తో గ్రనెడ్లు, బాంబులను ఇరాన్ తయారుచేసిందని, వీటి ప్రభావానికి లోనైతే.. బాధితుల నాడీ వ్యవస్థ కొన్ని క్షణాల్లో దెబ్బతింటుందని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం, పౌరులు లక్ష్యంగా ఈ రసాయన ఆయుధాల్ని ప్రయోగించేందుకు ఇరాన్ తయారు చేసిందని చెప్పారు. దీనిపై ఆయన రాసిన ఆర్టికల్ చర్చనీయాంశమైంది. ఇరాన్ రసాయన ఆయుధాల తయారీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని హెచ్చరించారు. రసాయన ఆయుధాల నుంచి వెలువడే పొగను ఒకసారి పీల్చిగానే, బాధితులు వెంటనే స్పృహ కోల్పోతారని, ఇజ్రాయెల్ సైనికులు, పౌరులను బందీలుగా చేసుకోవడానికి ఇరాన్ వాడొచ్చునని చెప్పారు.

హారిస్‌ను అధ్యక్షురాలిని చేయాలి

బైడెన్ వైదొలగాలని డిమాండ్లు

వాషింగ్టన్, నవంబర్ 11: అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ఓటమి డెమొక్రటిక్ నేతల్ని తీవ్రంగా నిరాశపర్చింది. ఎన్నికల్లో ఓడిపోయినా.. కమలా హారిస్‌ను ప్రెసిడెంట్‌ను చేయవచ్చునని డెమొక్రటిక్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేవరకు కమలాహారిస్‌కు పదవి అప్పగించాలని ఆమె మాజీ కమ్యునికేషన్స్ వ్యవహారాల డైరెక్టర్ జమాల్ సిమన్స్ బైడెన్‌కు సూచించారు. 'జో బైడెన్ గొప్ప అధ్యక్షుడు. అయితే ఆయన చేసిన వాగ్దానం.. నెరవేర్చాల్సి ఉంది. తన పదవికి రాజీనామా చేసి, కమలా హారిస్‌కు బాధ్యతలు అప్పగించాలి. తద్వారా అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలిగా కమలా హారిస్ నిలుస్తారు' అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం, కొత్త అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో బాధ్యతలు స్వీకరిస్తారు. దీనికి కొన్ని వారాల సమయముంది. అయితే బైడెన్ తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మరో 30 రోజులు చాలని సిమన్స్ గుర్తుచేశారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం తీవ్రం చేయొద్దు

- ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ సూచన
- ఖండించిన క్రెమ్లిన్ వర్గాలు

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధం మరింత తీవ్రతరం చేసుకోవద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు డొనాల్డ్ ట్రంప్ సూచించారట! యూరప్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా ఉందన్న సంగతి పుతిన్‌కు గుర్తుచేశారట. ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్టు అంతర్జాతీయ మీడియాలో సోమవారం వార్తా కథనాలు వెలువడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం సహా పలు విషయాలు ఇరువురు మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు ఎలా పలకాలన్నది వారిద్దరు మాట్లాడుకున్నారని 'వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. కాగా, వీటిని క్రెమ్లిన్ (పుతిన్ అధికార కార్యాలయం) వర్గాలు ఖండించా